


Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 206 | ఆదివారం 18 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కార్పొరేట్ల కోసం కాదు జాతీయ ప్రయోజనాల కోసమే
# ఒప్పందాలు జరగాలి
### - సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

జాతీయ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఒప్పందాలు కుదుర్చుకోవాలే తప్ప విదేశీ ప్రభుత్వాల నుంచి లేదా కార్పొరేట్ సంస్థల నుండి ఒత్తిళు వచ్చాయని కుదుర్చుకోరాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ పన్ను ఒప్పందాలను కుదుర్చుకునే సమయంలో భారతదేశం తన పన్ను సార్వ భౌమాధికారతను పరిరక్షించుకోవాలని స్పష్టం చేసింది. న్యాయంగా వ్యవహరించాలని, ఎలాంటి దుర్వినియోగానికి పాల్పడరాదని పేర్కొంది. 2018లో ఫ్లిప్‌కార్ట్ నుంచి అమెరికాకు చెందిన పెట్టుబడిదారీ సంస్థ టైగర్ గ్లోబల్ బయటకు రావడం వల్ల వచ్చిన కేపిటల్ గెయిన్స్‌కు భారత్‌లో పన్ను కట్టాలని భారత్ రెవిన్యూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు

- మిగతా 2లో..

# బీహార్‌లో గెలిచాం..

- బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది: నరేంద్ర మోదీ
- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్న మైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన

- మిగతా 2లో..

## ప్రాజెక్టుల్ని
# పడావు పెట్టారు

- 90 శాతం పూర్తయిన వాటినీ నిర్లక్ష్యం చేశారు
- ఇప్పుడూ వాటిని అడ్డుకొనేందుకు ఫాంహౌస్ శుక్రాచార్యుడు మారీచ, సుబాహుల్ని పంపుతున్నారు
- శత్రువులు లేరు..రాజకీయ ప్రత్యర్థులే..
- 2023లోనే వాళ్లను బండకేసి కొట్టా
- మహబూబ్‌నగర్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.1463.94 కోట్ల పనులకు శంకుస్థాపన
- జడ్చర్లలో ఐఐటీ క్యాంపస్‌కు భూమి పూజ



మహబూబ్‌నగర్ - సూర్య వాస్తవం

రాష్ట్రంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టుల్ని కూడా పూర్తిచేయకుండా వాటన్నింటినీ పడావు పెట్టిన ఘనత మాజీ సీఎం కే చంద్రశేఖరరావుదే అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. "రాష్ట్రాన్ని పదేండ్లపాటు పాలించి పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయ కుండా ఏడారిగా మార్చారు. భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి కోయిల్‌సాగర్, పాలమూరు -రంగారెడ్డి వంటి ప్రాజెక్టుల పనులు 90 శాతం పూర్తయ్యాయి. వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారు. మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా గెలిచి, రాజకీయ భిక్ష పెట్టిన ఈ ప్రాంత ప్రజలను విస్మరించారనీ, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క ప్రాజెక్టునైనా మంజూరు చేశారా?" అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జడ్చర్ల దగ్గర శనివారం ఐఐటి క్యాంపస్‌కు భూమి పూజ చేసిన అనంతరం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కళాశాల ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

- మిగతా 2లో..

## చరిత్ర తిరగరాయటం
# తెలుగువాళ్లతోనే సాధ్యం

- సీఎం చంద్రబాబు నాయుడు
- కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్
- 2027 జూన్ నాటికి గ్రీన్ అమోనియా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని వెల్లడి
- గ్రీన్ ఎనర్జీలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఉద్ఘాటన




అమరావతి- సూర్య వాస్తవం

చరిత్రను తిరగరాయడం తెలుగువాళ్లకే సాధ్యమని, ప్రపంచ గతిని మార్చే శక్తిసామర్థ్యాలు మనవారికి ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సత్తాను చాటేలా, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడ వేదిక కావడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏఎమ్ గ్రీన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో ఇకపై ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని, భవిష్యత్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "గతంలో ఇదే ప్రాంతంలో నాగార్జునా ఫెర్టిలైజర్స్ గ్రే అమోనియా

- మిగతా 2లో..

## క్రికెట్ ఆడి సందడి చేసిన మంత్రి నారా లోకేశ్




సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు

- నాలుగు రోజుల పాటు ఫుల్ బిజీ!
- ప్రపంచ ఆర్థిక సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలతో చర్చలు
- ఐబీఎం, గూగుల్, మేర్క్స్ సీఈఓలతో కీలక సమావేశాలు
- 4 రోజుల పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- తొలిరోజు 20 దేశాల ఎన్నార్టీలతో డయాస్పోరా సమావేశం



అమరావతి- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేడి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్య టించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచ ఆర్థిక సదస్సు (వరల్డ్ ఎకనామిక్ ఫోరం)లో పాల్గొనేందుకు ఆయన మంత్రులు, ఉన్నతాధికారుల బృందంతో కలిసి ఆదివారం బయల్దేరి వెళ్లనున్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఆయన అత్యంత బిజీగా గడపనున్నారు. మొత్తం 36 కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు. ఆదివారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి పయనం కానున్నారు. జనవరి 19న ఉదయం జ్యూరిచ్ చేరుకున్నాక, స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిశోర్ లుల్లా, ఆయన బృందంతో భేటీ అవుతారు.

పర్యటనలో తొలి ముఖ్య కార్యక్రమంగా, జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. సుమారు 20 దేశాల

- మిగతా 2లో..



## వ్యక్తిగత గొడవకు రాజకీయ రంగు
### - మంత్రులు కొల్లు రవీంద్ర

అమరావతి- సూర్య వాస్తవం

పల్నాడు జిల్లాలో వ్యక్తిగత ఘటనకు రాజకీయ రంగు పులిమి రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించాలనే దురుద్దేశంతో వైసిపి ప్రయత్నిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు కూటమి ప్రభుత్వం విరుద్ధమని అన్నారు. పల్నాడు జిల్లాలో జరిగిన ఘటన పూర్తిగా వ్యక్తిగత గొడవేనని, దానిని ఆసరాగా చేసుకుని కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. వైసిపి పాలనలో పల్నాడు ప్రాంతంలో

- మిగతా 2లో..

# బీహార్‌లో గెలిచాం..

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్డా, ముర్షీదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

## కార్పొరేట్ల కోసం కాదు జాతీయ ప్రయోజనాల కోసమే

# ఒప్పందాలు జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

సమర్థించింది. ఈ సందర్భంగా జస్టిస్ జెబి పార్దివాలా ఈ వ్యాఖ్యలు చేశారు. బెంచ్ అభిప్రాయంతో ఏకీభవిస్తూనే, ఆయన విడిగా ఒక నోట్ రాశారు. ”పన్ను ఒప్పందాలు, అంతర్జాతీయ ఒప్పందాలు, ప్రొటోకాల్స్, పరిరక్షణా చర్యలు పారదర్శకంగా వుండాలి, వాటిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుగుతూ వుండాలి, అన్యాయం, అక్రమాలతో కూడిన ఫలితాలను రాకుండా నివారించేందుకు బలమైన ఎగ్జిట్ క్లాజులు వుండాలి, అటువంటి వాటిపై సమర్ధవంతంగా చర్చలు జరిపే శక్తి సామర్థ్యాలు వుండాలి. దేశ వ్యూహాత్మక భద్రతను పరిరక్షించుకోవాలి, పన్ను వ్యవస్థ తుడిచిపెట్టుకుపోకుండా, నష్టపోకుండా నివారించాలి, ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడకుండా చూడాలి, మొత్తంగా పన్నుల విధింపునకు సంబంధించి సార్వభౌమాధికార హక్కును పరిరక్షించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.” అని ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఒప్పందాలనేవి స్థూలంగా ఆర్థిక, ప్రజాప్రయోజనాలను ప్రతిబింబించేలా వుండాలి తప్ప అధికార యంత్రాంగం లేదా దౌత్య లక్ష్యాలకు పరిమితం కారాదని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు.

# నేడు దావోస్‌కు సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి హాజరయ్యే ప్రవాస తెలుగువారిని (ఎన్నారైలు) ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో దావోస్ చేరుకుంటారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే అంతర్జాతీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశమవుతారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా సీఎంతో భేటీ కానున్నారు. ప్రముఖ విదేశీ మీడియా సంస్థ 'పొలిటికో'కు చంద్రబాబు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

**టెక్ దిగ్గజాలతో కీలక చర్చలు**

పర్యటనలో రెండో రోజు అత్యంత కీలకంగా జరగనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించే 'ఇండియా ఎట్ సెంటర్: జియోగ్రఫీ, గ్రోత్ - ఏపీ అడ్వాంటేజ్' అనే బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని అవకాశాలను వివరిస్తారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇండియా లాంజ్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత టెక్నాలజీ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థలైన ఐబీఎం ఛైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాష్ట్రానికి టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అదే రోజు ఇజ్రాయెల్ ఆర్థిక, పారిశ్రామిక మంత్రి నిర్ బర్కత్‌తో, స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మంత్రి హెలెన్ బడ్లిజెర్ అర్టెడాతోనూ చర్చలు జరుపుతారు. ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్‌మండ్‌తో పాటు, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రంలో పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ ఏపీ మోలర్-మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్‌తో ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ముఖాముఖి సమావేశం కానున్నారు.

**వివిధ అంశాలపై చర్చా వేదికల్లో ప్రసంగాలు**

మూడో రోజు పర్యటనలో భాగంగా, 'హీలింగ్ ప్లానెట్ త్రో రీజెనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్' అనే అంశంపై జరిగే చర్చా కార్యక్రమంలో, బ్లూమ్‌బెర్గ్ సంస్థ నిర్వహించే 'ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్: ఏఐ మూమెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగిస్తారు. పారిశ్రామిక పురోగతి, వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో కూడా ఆయన పాల్గొంటారు. ఏపీ లాంజ్‌లో కేంద్ర మంత్రులతో కలిసి 'బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ల కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. మొత్తంగా ఈ నాలుగు రోజుల పర్యటనలో 3 ప్రభుత్వాల మధ్య సమావేశాలు, 16 మంది పారిశ్రామికవేత్తలతో వన్-టు-వన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా నిలపడమే లక్ష్యంగా ఆయన పర్యటన సాగనుంది. ఇక జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి, 23వ తేదీ ఉదయం 8:25 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్ చేరుకుంటారు.

## వ్యక్తిగత గొడవకు

# రాజకీయ రంగు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, ప్రజలను గ్రామాల నుంచి తరిమివేసిన ఘటనలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయని చెప్పారు. అంబేద్కర్ విగ్రహాలపై దాడులు, తిరుపతి ఘటనలు, తప్పుడు వీడియోలు, సోషల్ మీడియా ప్రచారాలన్నీ ఉద్దేశపూర్వక కుట్రలేనని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఫ్యాక్షన్ రాజకీయం పల్నాడు ప్రాంతాన్ని ఇంకా వెంటాడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడులపై వైసిపి విషం చిమ్ముతూ ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా బెదిరింపులు, భయభ్రాంతులు సృష్టిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేని వైసిపి విధ్వంసకర రాజకీయాలను మానుకోవాలన్నారు.

## చరిత్ర తిరగరాయటం

# తెలుగువాళ్లతోనే సాధ్యం



(మొదటిపేజీ తరువాయి)

తయారు చేస్తే, ఇప్పుడు అదే చోట పర్యావరణహితమైన గ్రీన్ అమోనియా ఉత్పత్తి కాబోతోంది. ఇది మార్పునకు సంకేతం. చరిత్రను తిరగరాయడం అంటే ఇదే. తెలుగువాళ్లు తలచుకుంటే ఏదైనా సాధించగలరు. గత ఏడాది ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే, సరిగ్గా ఏడాది తిరిగేసరికి పనులు ప్రారంభించడం మన పనితీరుకు నిదర్శనం. ఇది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చక్కటి ఉదాహరణ” అని అన్నారు. 495 ఎకరాల్లో, 2 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారని వెల్లడించారు. 2027 జూన్ నాటికి ఉత్పత్తి ప్రారంభించి, ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియాను ఇక్కడి నుంచి జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని అందిపుచ్చుకుని, రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. “సౌర, పవన, జల విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజీకి ఏపీ అత్యంత అనుకూలమైన రాష్ట్రం. మనకున్న సుదీర్ఘ తీరప్రాంతం, రాబోయే 20 పోర్టులతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ఏపీ కేంద్రంగా మారుతుంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీపై ఎక్కడ చర్చ వచ్చినా కాకినాడ పేరు వినిపిస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'క్లీన్, గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ పాలసీ-2024' దేశంలోనే అత్యుత్తమమైనదని, పారిశ్రామికవేత్తలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ, ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా అనుమతులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “విశాఖలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ఏడాదిలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్పేస్ టెక్నాలజీలో కూడా పురోగతి సాధిస్తాం. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా తీర్చిదిద్దుతాం” అని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలపై విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే 29 పైసలు తగ్గించామని తెలిపారు. గ్లోబల్ సంస్థలన్నీ ఏపీ నుంచి తమ కార్యకలాపాలు నిర్వహించాలని పిలుపునిచ్చిన ఆయన, రాష్ట్రంలోకి వచ్చే ప్రతి పెట్టుబడికి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# ప్రాజెక్టుల్ని పడావు పెట్టారు

(మొదటిపేజీ తరువాయి)

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ఆనాటి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీ విఠల్‌రావు, అప్పటి మంత్రి డికె.అరుణ, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 2013లో మంజూరైందని గుర్తు చేశారు. రూ.25 వేల కోట్ల అంచనాలతో ప్రారంభం అయిన ప్రాజెక్టు పనులకు బీఆర్‌ఎస్ హయాంలో బిల్లులు ఎత్తారు తప్ప, రైతులకు భూసేకరణ పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మాణం పేరుతో కమీషన్‌లు తీసుకున్నారు.. కూల్చారు. సంగంబండకు కనీసం రూ.10 కోట్లు ఇచ్చి లక్ష ఎకరాలకు సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో చనాకా-కొరాటా పంప్‌హౌస్, సదర్మాట్ బ్యారేజీ ప్రారంభిస్తే, ప్రాజెక్టులు తాము నిర్మిస్తే, వాటిని రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నాడని ఓ మారీచుడు విషం చిమ్ముతున్నాడంటూ ప్రతిపక్షంపై విమర్శనాస్త్రాలు సంధించారు.

**మారీచ-సుబాహులు**

పూర్వకాలంలో ఋషులు యజ్ఞాలు, యాగాలు చేస్తుంటే, రాక్షస గురువు శుక్రాచార్యుడు తన శిష్యులు మారీచుడు, సుభాహుడని పంపి, వాటికి అడ్డు తగిలేవారనీ, ఇప్పుడు ప్రతిపక్షనేత శుక్రచార్యుడిగా ఫామ్‌హౌస్‌లో ఉంటూ.. బావబామ్మర్ది ముసుగులో మారీచ, సుభాహులను ప్రాజెక్టులను అడ్డుకోవాలని పంపుతున్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు మాయలేడి రూపంలో వస్తే రాముడు బాణానికి బలైనట్టు.. అలాంటి రాక్షసులను కట్టిపడేసే శక్తి పాలమూరు ప్రజలకు, ఈ గడ్డ బిడ్డగా తనకు ఉందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని, ప్రత్యర్థులను ఓడించడానికి ఎంతవరకైనా వెళ్తామని అన్నారు. రాజకీయాల అనంతరం అభివృద్ధి గురించే ఆలోచిస్తామన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు డికె అరుణకు వ్యతిరేకంగా తామంతా ప్రచారం చేసినా, ఎన్నికల్లో ఆమెను ప్రజలు ఆదరించారని గుర్తుచేశారు. డికె అరుణ సహకారంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధులను, ప్రాజెక్టులను సాధిస్తామని తెలిపారు.

**అప్పుడు చెల్లిందొ౹ఇప్పుడు చెల్లదు**

'మాకు వ్యూహాలు, ఎత్తుగడలు తెలుసు. జైపాల్‌రెడ్డి, జానారెడ్డి కాలంలో చెల్లినట్టు ఇప్పుడు చెల్లదు. నాకు వ్యక్తిగతంగా శత్రువులు ఎవరూ లేరు. రాజకీయ ప్రత్యర్థులు ఉంటే వారిని ఎన్నికల్లో ఓడించాం. నాకు శత్రువు అనుకున్న వారిని 2023లోనే బండకేసి కొట్టాను. 2024 పార్లమెంటు ఎన్నికల్లో గుండుసున్నా ఇప్పించా. అన్ని ఎన్నికల్లో గెలిచాం. ఆయన నడుము విరిగి ఫామ్‌హౌస్‌లో పడుకుంటే, నాకు శత్రువు ఎలా అవుతాడు' అని చెప్పుకొచ్చారు. శాసనసభలో ప్రజాసమస్యలపై చర్చలకు రాని నాయకులు ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. ఎప్పటిలాగే మున్సిపాల్టీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంచోళ్లను, మనోళ్లనే గెలిపించాలని, మంత్రులను కలిసి పని చేసేవారిని గెలిపించుకోవాలని కోరారు.

**విద్య, వైద్యం లేకే వెనుకబాటు**

విద్య, వైద్యం అందించపోవడం వల్లే మహబూబ్‌నగర్ ప్రాంత ప్రజలు వెనుకబాటుకు గురయ్యారని సీఎం అన్నారు. దేశ విదేశాల్లో భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేయడంలో పాలమూరు లేబర్ కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. ఉద్దండాపూర్, అదిలాబాద్ రైతులకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ పరిహారం ఇచ్చామని గుర్తు చేశారు.

కేఎల్ఐ చివరి ఆయకట్టుకు నీరందించేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి మేరకు నిధులు ఇచ్చి కాల్వలు పూర్తి చేయడానికి సహకరించామన్నారు. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు 7.50 టీఎంసీల సామర్థ్యంతో రూ.1500 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును నిర్మిస్తామని తెలిపారు. జూరాల డ్యాంకు సమాంతరంగా మరో డ్యాం నిర్మాణం కోసం రూ.123 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేస్తామన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిట శ్రీహరి, అజహరుద్దీన్, ఎంపీలు డీకే అరుణ, మల్లురవి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, రాంమ్మోహన్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్ ఎపి.జితేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, నాయకులు సంపత్‌కుమార్, వనపర్తి జిల్లా అధ్యక్షులు శివసేనారెడ్డి, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఓబేదుల్లా కోత్వాల్, డీసీసీ అద్యక్షులు సంజీవ్ ముధిరాజ్, శివకుమార్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాంకృష్ణారావు, జిల్లా కలెక్టర్ విజయేందర్‌బోయి పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు.

# క్రికెట్ ఆడి సందడి చేసిన మంత్రి నారా లోకేశ్

**మంగళగిరి - సూర్య వాస్తవం**

మంగళగిరి ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) సీజన్ -- 4 క్రికెట్ పోటీలు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ప్రస్తుతం 27వ రోజుకు చేరుకున్న ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. మూడో రౌండ్ చివరి మ్యాచ్‌గా వల్లభనేని వెంకట్రావ్ యూత్, విక్కీ 11 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు మంత్రి లోకేశ్ టాస్ వేశారు. అనంతరం సరదాగా ఆయన కాసేపు క్రికెట్ ఆడారు. దీనికి సంబంధించిన ఫొటోలను మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేయగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నట్టు, సరదాగా కాసేపు క్రికెట్ ఆడినట్లు లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రముఖ వైద్యులు ఆదినారాయణరావు మృతి

### - పోలియో బారినపడ్డ వేలాది మందికి వైద్య సేవలతో గుర్తింపు

**విశాఖపట్నం- సూర్య వాస్తవం:** విశాఖ నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, పద్మశ్రీ సుంకరి వెంకట ఆదినారాయణరావు శనివారం కన్నుమూశారు. నగరంలో పేరుగాంచిన ప్రేమ హాస్పిటల్ యజమాని అయిన ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. 1939 జూన్ 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదినారాయణరావు జన్మించారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యునిగా గుర్తింపు పొందారు. పోలియో బారినపడ్డ వేలాది మందికి వైద్యం చేసి విలువైన సేవలందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. ఆయన జాతీయ స్థాయిలో ఫుట్ బాల్ క్రీడలో మంచి క్రీడాకారునిగా పేరుపొందారు. విశాఖ నగర ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా కొన్ని దశాబ్దాలు పనిచేసి అనేక మంది క్రీడాకారులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. ఆయనను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సత్కరించింది. ఆయన భార్య ఆర్.శశిప్రభ నగరంలో ప్రముఖ వైద్యురాలిగా గుర్తింపు పొందారు. కెజిహెచ్‌లో వైద్యురాలిగానూ, సూపరింటెండెంట్‌గానూ పనిచేశారు. నగరంలోని వరుణ్ బీచ్‌కు ఎదురుగా డాక్టర్ ఆదినారాయణరావు నివసిస్తున్నారు.

# ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్

### - అసోసియేషన్ విజ్ఞప్తి

**అమరావతి- సూర్య వాస్తవం**

మండల విద్యాశాఖ అధికారి (ఎంఇఒ)-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం కల్పించాలని ఎంఇఒ-1 అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామల సింహాచలం, బుక్కా రవినాయక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు డిడిఒగా ఉన్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. పరిమిత స్థాయిలో ఉపాధ్యాయులున్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సైతం సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించిన ప్రభుత్వం మండలానికి అధికారిగా ఉన్న ఎంఇఒ-1లకు ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఎంఇఒలపై పనిఒత్తిడి చాలా అధికంగా ఉంటుందని, చిన్నచిన్న కారణాలకు సైతం సస్పెన్షన్లు చేయడం సరికాదని తెలిపారు. తమ సమస్యలపై విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకొని పరిష్కరించాలని కోరారు.

**డీఏ బకాయిలు చెల్లించాలి : టీచర్స్ గిల్డ్**

ఎయిడెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు 4 విడతల డిఎ బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుకగా విడుదల చేసిన డిఎ బకాయిల్లో 10 శాతం మందికి మాత్రమే క్రెడిట్ అయ్యాయని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్‌కె చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిడెడ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల బిల్లులకు సిఎఫ్‌ఎంఎస్ నందు గ్రీన్ ఛానల్ సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

# సంపాదకీయం

## ముందుకు సాగని వాణిజ్య చర్చలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడం వల్లనే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరలేదంటూ ఆ దేశ వాణిజ్య శాఖ మంత్రి హ్వావర్డ్ లుట్నిక్ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. . రెండు దేశాలు సిద్ధమైన వెంటనే ఒప్పందాన్ని ప్రకటిస్తామని చెప్పారు. చర్చలకు గడువు అనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరు దేశాల చర్చా బృందాలు పెండింగ్‌లో ఉన్న దాదాపు అన్ని అంశాలపై వర్చువల్‌గా చర్చలు కొనసాగిస్తున్నాయని అగర్వాల్ చెప్పారు. ఒప్పందం చాలా దగ్గరలోనే ఉందని, అయితే ఇరు పక్షాలు సిద్ధమైనప్పుడే, సరైన సమయమని భావించినప్పుడే సరైన ప్రకటన వస్తుందని ఆయన మీడియాతో చెప్పారు.గతేడాది ఫిబ్రవరి 13 నుంచి ఇరుదేశాల మధ్య పలుమార్లు వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయి. కొన్ని విషయాల్లో అంగీకారం కుదరకపోవడంతో ఒప్పందం సాధ్యపడలేదు.చివరిసారిగా డిసెంబర్ 11న భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ చర్చలు తుది దశకు వచ్చాయని, త్వరలోనే ఒప్పందం జరుగుతుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ ఆనాడు ప్రకటించారు. అయితే ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడనందునే ట్రేడ్ డీల్ జరగడం లేదని లుట్నిక్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితం. ఇదే విషయాన్ని భారత విదేశాంగశాఖ కార్యదర్శి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.గతేడాది నుంచి వివిధ అంశాలకు సంబంధించి మోదీ, ట్రంప్ ఇప్పటివరకు 8 సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారన్నారు. ట్రంప్ మాట్లాడిన ప్రతీసారి మోదీ తనకు మంచి మిత్రుడనీ, భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నట్లు చెప్పినట్లు తెలిపారు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిన వెంటనే, తదుపరి ఒప్పందం భారత్‌తోనే అని ట్రంప్ స్వయంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.అయితే వాణిజ్యం విషయంలో భారత్‌కు స్పష్టమైన విధానాలు ఉన్నాయని, ఏ దేశంతోనైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు తన సర్వాధికారాన్నీ, స్వతంత్రతను కాపాడుకునే విధంగానే సంప్రదింపులు జరుపుతుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇక ప్రతీ ఏడాది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలు జరుగుతూనే ఉంటాయి. భారత్?అమెరికా మధ్య చర్చలు ఎప్పుడూ నిలిచిపోలేదని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ఇరు పక్షాలు నిరంతరం సంప్రదింపుల్లోనే ఉన్నాయని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ చివరి వారంలో వాణిజ్య?పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో వర్చువల్ సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 10, 11 తేదీల్లో ఉప యూఎస్టీఆర్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని బృందం భారత్ పర్యటన తర్వాత ఈ సమావేశం జరిగింది. జనవరి 12న తన బాధ్యతల స్వీకరణ సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్, వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఇరు దేశాలు చురుకుగా పనిచేస్తున్నాయని చెప్పారు.భారత్, అమెరికా మధ్య సంబంధాలు ఉమ్మడి ప్రయోజనాలకే పరిమితం కావని, అత్యున్నత స్థాయిలో బలమైన అనుబంధం ఉందన్నారు.నిజమైన మిత్రులు విభేదించినా, చివరకు పరిష్కారం కనుగొంటారని గోర్ వ్యాఖ్యానించారు.ట్రంప్ ప్రభుత్వం విధించిన 50 శాతం వరకు ఉన్న భారీ సుంకాలు ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడి తెచ్చాయని అధికారులు పేర్కొన్నారు. అదనపు దిగుమతి సుంకాల అంశంతో పాటు, గత ఏడాది మేలో భారత్?పాకిస్తాన్ ఘర్షణ ముగిసిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, వాషింగ్టన్ కొత్త వలస విధానం వంటి అంశాలపై కూడా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం సానుకూల వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు.ఈ ఏడాది మాత్రం ఒప్పందంపై సంతకాలు చేసే విషయంలో జాప్యానికి అమెరికా అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణమని చెప్పొచ్చు.ముఖ్యంగా చమురు కొనుగోలు విషయంలో భారత్ మొదటి నుంచి ఒక స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఎన్నో ఏళ్లుగా మనం రష్యా నుంచే చమురు కొనుగోలు చేస్తూ వస్తున్నాం. కానీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దంటూ ట్రంప్ పదేపదే ఆంక్షలతో భారత్‌ను బెదిరింపులకు గురి చేస్తున్నారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా వారితో వ్యాపారం ఆపకపోతే టారిఫ్‌ను 500 శాతానికి పెంచడానికి సిద్ధమవుతున్నట్లు ప్రత్యక్ష హెచ్చరికలకు దిగడం కూడా భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం జాప్యానికి కారణంగా నిలిచింది. ఇటీవలే వెనిజులాను తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్న అమెరికా.. తమ నుంచి మాత్రమే చమురును కొనాలంటూ భారత్ సహా ఇతర దేశాలపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదు.పైగా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని రష్యా ఆపాలనే ఉద్దేశంతోనే ఆ దేశం నుంచి చము రు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీ సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు ట్రంప్ తనను తాను సమర్థించుకున్నారు. అంతేకాదు కేవలం సుంకాల విషయంలోనే వారం వ్యవధిలో తాను సంతోషంగా లేనన్న విషయం మోదీకి తెలుసని ఒకసారి, మోదీ నా పట్ల సంతోషంగా లేరంటూ మరోసారి భారత్ పట్ల మాటలు మార్చడం ట్రంప్‌కే చెల్లింది. ఈ నేపథ్యంలో భారత్‌తో ట్రేడ్ డీల్ జరగకపోవడానికి కారణమేంటనే దానిపై అమెరికా ఆత్మవిమర్శ చేసుకోవాలి.



# కూటమి ఉన్నట్లా.. లేనట్లా..

## మనల్ని కాదన్నట్లు దులిపేసుకుంటున్నారా?

**విజయవాడ - సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీకి సీనియర్ల అవసరం ఖచ్చితంగా కనిపిస్తుంది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కేవలం చంద్రబాబు నాయుడు మీదనే ఆధారపడి ఉండేలా పార్టీ నడిచేది కాదు. కానీ చంద్రబాబు నాయుడు ఇప్పుడు విదేశాలకు వెళ్లినా, మరొకచోటకు అధికార పర్యటనకు వెళ్లినా విపక్షం చేసే విమర్శలకు మాత్రం సూటిగా సమాధానమిచ్చే సీనియర్ నేతలు కొరవయ్యారనే చెప్పాలి. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఒకరిద్దరు నేతలు తప్ప ఎవరూ పెద్దగా పెదవి విప్పడం లేదు. ఇక కొత్తగా వచ్చిన నేతలు ప్రతిపక్ష పార్టీ చేసే విమర్శలకు ఘాటుగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. వారి కౌంటర్లు ప్రజల్లోకి బలంగా వెళ్లలేకపోవడం పార్టీకి మైనస్ గా మారిందన్నది అందరూ అంగీకరిస్తున్నదే.మరొకవైపు కూటమిలో ఉన్న మిత్రపక్షాలు తమను కాదన్నట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది.కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పద్దెనిమిది నెలలు కావస్తుంది. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అలాగే అభివృద్ధి పనులను కూడా అంతేస్థాయిలో ముందుకు తీసుకెళు తుంది. రాష్ట్ర భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని అనేక




నిర్ణయాలు తీసుకుంటుంది. మరొకవైపు కూటమి ఉన్నట్లా లేన్నట్లా అన్న అనుమానం కూడా కలుగుతుంది. టీడీపీని కానీ, చంద్రబాబును కానీ విపక్షాలు విమర్శిస్తే అందులో మిత్ర పక్షాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. జనసేన నేతలు కానీ, బీజేపీ లీడర్లు కానీ విపక్షాలకు కౌంటర్ ఇవ్వడం లేదు. వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలియదు కానీ కూటమి ప్రభుత్వంపై చేసే విమర్శలకు కూడా టీడీపీ నేతలే కౌంటర్ ఇవ్వాల్సిన దయనీయ స్థితిని చూడాల్సి ఉంది. మెడికల్ ప్రయివేటు కళాశాలల ప్రయివేటీకరణపై కూడా మిత్ర పక్షాల నుంచి పెద్దగా స్పందన రాలేదు.నిజానికి చంద్రబాబు విదేశాల్లో ఉన్న సమయంలో భోగాపురం ఎయిర్ పోర్టులో తొలి విమానం ల్యాండ్ అయింది. దీనిపై వైసీపీ తమ ప్రభుత్వ హయాంలో భోగాపురం చాలా వరకూ పూర్తయిందని చెప్పుకుంది. టీడీపీ నేతలు మినహా జనసేన, బీజేపీ నేతలు అసలు స్పందించలేదు. అసలు తమను కాదన్నట్లుగానే వారు వ్యవహరించారు. అలాగే రాయలసీమ ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఒకరిద్దరూ టీడీపీ నేతలు కౌంటర్ ఇచ్చారు తప్పించి జనసేన, బీజేపీలు తమది కాదన్నట్లు వ్యవహరించడం కూడా రాజకీయంగా చర్చనీ యాంశ మైంది. అసలు కూటమిలో ఏం జరుగు తుందన్న అనుమానం మాత్రం టీడీపీ నేతల్లో కలుగుతుంది. మరి దీనికి సమాధానం ఎవరు చెబుతారన్నది చూడాలి.

# ముంబై తరహాలో విశాఖ నగరం

**విశాఖపట్టణం - సూర్య వాస్తవం:** సాగరతీరం విశాఖపట్నం అభివృద్ధి మీద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా ముంబై తరహాలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఏపీ నుంచి అధికారుల బృందం ముంబైలో పర్యటించింది. సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విధానాలను అధ్యయనం చేసింది. ఆ విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నం రూపురేఖలు త్వరలోనే మారిపోనున్నాయి. ముంబై తరహాలో విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన నేషనల్ గ్రోత్ హబ్‌లో భాగంగా, విశాఖ పట్నాన్ని గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం ముంబైలో విజవంతమైన సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ , ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహా విధానాలను ఏపీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు విశాఖ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద.. కైలాసగిరి, భీమిలి మధ్య బే సిటీని అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ సూచించింది.

విశాఖపట్నం 2.0ను భోగాపురం విమానాశ్రయం వరకు విస్తరించాలని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ ఏరోసిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి.. ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం జనవరి 12, 13 తేదీలలో పట్టణ అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేయడానికి ముంబైని సందర్శించింది. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంపై




ఆధారపడకుండా ల్యాండ్ మానిటైజేషన్, ఈఎ ప్రీమియంల ద్వారా నిధులు ఎలా సమకూర్చుకోవాలో వీరు అధ్యయనం చేశారు.ఈ సందర్శనలో భాగంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆర్థికంగా స్వయం సమృద్ధిని ఎలా సాధించాయనే దానిపై అధ్యయనం జరిపారు. అలాగే ప్రతిపాదిత భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ 2.0 ప్రాజెక్టులకు బెంచ్‌మార్క్‌లుగా అఎఆఊ నవీ ముంబై, (నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ నోటిఫైడ్ ఏరియా) నమూనాలను అధ్యయనం చేశారు. మరోవైపు ప్రస్తుతం దాదాపు రూ. 14,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పనిచేస్తుంది, ఎక్కువగా భూమి, రియల్ ఎస్టేట్ ఆధారిత ఆదాయాల ద్వారా నిధులు సమకూరుస్తుంది.మరోవైపు నీతి ఆయోగ్ ఇటీవల డెవలపింగ్ విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ యాజ్ గ్లోబల్ ఎకనమిక్ హబ్ అనే పేరుతో నివేదికను విడుదల చేసింది, ఈ ఎకనమిక్ రీజియన్.. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు తొమ్మిది జిల్లాలను కవర్ చేస్తుంది. నీతి ఆయోగ్ నేషనల్ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ఎంపిక చేశారు. మరోవైపు ముంబై నుంచి నేర్చుకున్న వాటి ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ల్యాండ్ వాల్యూ క్యాప్చర్, ల్యాండ్ మానిటైజేషన్ పాలసీలను అనుసరించనుంది. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్ వైజాగ్ 2.0 ఆలోచన చేస్తున్నారు. దక్షిణాన విశాఖపట్నం ఓడరేవు నుంచి ఉత్తరాన భోగాపురం విమానాశ్రయం వరకు 200-250 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఆలోచన చేస్తున్నారు. అలాగే వైజాగ్ బే సిటీని 40 చదరపు కిలోమీటర్ల ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా ప్రతిపాదించారు. కైలాసగిరి, భీమిలి మధ్య 25 కి.మీ తీరప్రాంతాన్ని వాటర్‌ఫ్రంట్ నగరంగా మార్చాలని ఆలోచనలు చేస్తున్నారు.మరోవైపు మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలోని ఐటీ, డేటా సెంటర్ హబ్‌లు, భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ బే సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా విశాఖ రూపురేఖలు మారుతాయని భావిస్తున్నారు.

# ఈశాన్య సైన్యం మోహరింపు..

## బంగ్లాదేశ్‌లో మొదలైన వణుకు

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం:** భారత ప్రభుత్వం హఠాత్తుగా సైన్యాన్ని త్రిపుర, మిజోరాం వైపు తరలిస్తోంది. వాస్తవంగా ఈ రాష్ట్రాలకు ఎలాంటి ముప్పు లేదు. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో సైనిక కార్యకలాపాలు వేగవంతం చేస్తోంది. 1971 యుద్ధంలో అగర్తల భారత కేంద్రంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సహాయం చేసినట్లుగా ఇప్పుడు కొత్త పరిణామాలు సూచిస్తున్నాయి. బంగ్లాదేశ్ చిట్టగాంగ్ హిల్ ట్రాక్‌లో జరుగుతున్న ఘర్షణలు ఇందుకు కారణం.బంగ్లాదేశ్ మైదానాల మధ్య చిట్టగాంగ్ హిల్ ట్రాక్ కొండలు, అడవులతో భారత్ (మిజోరాం, త్రిపుర), బర్మాను వేరుచేస్తుంది. ఇక్కడ 13 గిరిజన తెగలు (జోమా పీపుల్) బుద్ధిస్టులు, హిందువులు, క్రై స్తవులుగా




ఉన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ ముస్లిం స్థిరనివాసులను పెంచి గిరిజనుల సంఖ్యను తగ్గించాయి. కుకీ చిన్ నేషనల్ ఫ్రంట్ (కేఎన్ఎఫ్) ఏడాదిన్నరగా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో పోరాడుతోంది. ఈ ప్రాంతం దేశ భూభాగంలో 2025శాతం ఉంటుంది, చిట్టగాంగ్ పోర్టు కీలకం. ఘర్షణల వల్ల గిరిజనులు మిజోరాం, త్రిపుర లోకి ప్రవేశిస్తున్నారు. భారత్ వారికి పునరావాసం, మానవీయ సహాయం అందిస్తోంది. గూఢచార సంస్థలు బంగ్లాదేశ్‌లో శరణార్థులతో చర్చలు జరిపాయి. బంగ్లాదేశ్ భారత్ ఆయుధాలు, శిక్షణ ఇస్తోందని అనుమానిస్తోంది.1971 ముందు ఆగస్టు 15న చిట్టగాంగ్‌లో త్రివర్ణ పతాకం ఎగిరింది. పాకిస్తాన్ ఆక్రమించి ముస్లింలను స్థిరపరిచింది. 1969 కప్తా డ్యాం గిరిజనులను తరిమేసింది. ఈ చరిత్ర మధ్య భారత్ 1971లో అగర్తల నుంచి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి సహకరించింది.చిట్టగాంగ్ హిల్ ట్రాక్ భారత్‌లోని రెండు, బర్మాలోని రెండు ప్రాంతాలతో లింక్. దీన్ని ఉపయోగించుకుంటే చికెన్ నెక్‌పై ఒత్తిడి తగ్గుతుంది. కేఎన్ఎఫ్ గెరిల్లా దాడులు బంగ్లాదేశ్ సైన్యాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. భారత మద్దతు, బర్మా ఉగ్రవాదుల సహకారం అనుమానాలు పెరుగుతు న్నాయి. మహ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక హిందువులపై 2,900 దాడులు జరిగాయి. చిట్టగాంగ్ పోర్టు, భూభాగ నష్ట ప్రమాదం బంగ్లాదేశ్‌ను భయపెడుతోంది. భారత సైన్య మోహరాయనం దీన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. బంగ్లాదేశ్ భారత్‌ను నిందించకపోయినా ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# కరువు భత్యం బకాయిల చెల్లింపులో
# సాంకేతిక లోపాలను సరిదిద్దండి

**అనంతపురం – సూర్య వాస్తవం:** కరువు భత్యం చెల్లింపులో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి ప్రతి ఉద్యోగికి కరువు భత్యం బకాయిలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు విన్నవించారు. ఈ మేరకు జిల్లా ఉప ఖజానా శాఖాధికారి రాణికు శనివారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2018, 2019 సంవత్సరాలకు సంబంధించిన డీఏ బకాయిల చెల్లింపుల ప్రక్రియకు శ్రీకారం చుట్టడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ వివిధ సాంకేతిక కారణాలతో జిల్లా వ్యాప్తంగా చాలా మండలాలలో సీపీఎస్ ఉద్యోగులకు కరువు భత్యం బకాయిలు ఖాతాల్లో జమ కాలేదని వివరించారు. 2022 ఏప్రిల్ నెలలో ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో హడావుడిగా బిల్లులు సబ్మిట్ చెయమనడంతో చాలామంది డీడీఓలు సకాలంలో బిల్లులు సబ్మిట్ చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది డీడీఓలు బిల్లులు సబ్మిట్ చేసినప్పటికీ వివిధ రకాల కారణాలతో ట్రెజరీ అధికారులు బిల్లులను రిజెక్ట్ చేయడం, ఆ బిల్లులను రీ సబ్మిట్ చేసే అవకాశం డీడీఓలకు కల్పించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీ.ఎఫ్.ఎం.ఎస్ సైట్ లో సాంకేతిక



కారణాలతో ఆరు విడుదల బిల్లులు పెట్టినప్పటికీ కొంతమంది ఉద్యోగులకు ఒకటి రెండు విడతల బకాయిలు మాత్రమే జమ అయినట్లు తెలిపారు. ఈ విధంగా ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు అందకపోవడం అన్యాయమ న్నారు. ప్రతి ఉద్యోగి వేల రూపాయల బకాయిలు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం సీఎఫ్ఎం ఎస్ సైట్‌లో పెండింగ్ లేదా రిజిస్ట్ చేసిన డీఏ బిల్లులను తిరిగి అప్లోడ్ చేయడానికి అవకాశం కల్పిస్తూ రీ సబ్మిట్ చేయడానికి డీడీఓలకు  అవకాశం ఇచ్చి ప్రతి ఒక్క సీపీఎస్ ఉద్యోగికి అన్ని విడతల బకాయిలు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మల్లికార్జున, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సుధాకర్, యూనియన్ నాయకులు రామాంజనేయులు, మృత్యుంజయ, రమేష్, వన్నూరప్ప, రామచంద్ర, ఓబయ్య, సూర్య ప్రకాష్, షఫీ పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ రాముకు అరుదైన గౌరవం

### - మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ నుంచి సర్టిఫికెట్ అందజేత



**అనంతపురం – సూర్య వాస్తవం:** అనంతపూర్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఆదివారం గోసేవ నారాయణ సేవ తులసి ఉసిరి వినాయక చవితికి మట్టి విగ్రహాల కార్యక్రమం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి శ్రీవారి సేవకులకు ఎంజిజిపి ఇండియా ఫౌండేషన్ వారిచే శనివారం ఎస్కే యూనివర్సిటీ వీసీ అనిత చేతులమీదుగా సర్టిఫికెట్స్ అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ సేవ చేసినందుకు మమ్మల్ని గుర్తించి సర్టిఫికెట్ అందజేసిన ఫౌండేషన్ వారికి అలాగే వైస్ ఛాన్సలర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. సర్టిఫికెట్స్ అందుకున్న వారిలో ప్రసాద్, నాగరాజు, మురళి, మహేష్, శివ, ముఖేష్, ఓపిరెడ్డి, హనుమంతు, తదితరులు అందుకున్నారు.

## గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ



**పులివెందుల– సూర్య వాస్తవం:** పులివెందుల శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భాను ప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠకులను గ్రంథాలయం నిర్వహణ గురించి అడిగి వారికి కావల్సిన పుస్తకాలను త్వరలోనే అందిస్తామని తెలియజేశారు. పుస్తకాలు ర్యాకులను, బాత్ రూమ్‌లను పరిశీలించి సంత్రుప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి, లైబ్రరీ హెల్పర్ లక్ష్మీ నరసమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

### - ఈఈ వై.శ్రీనివాసులు



**నాయుడుపేట - సూర్యవాస్తవం:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రతిపాదించిన విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్య క్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయుడుపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. శ్రీనివాసులు తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ టారిఫ్ ధరలపై ఈ నెల 20, 22, 23 తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాయుడు పేట డివిజన్ కార్యాలయంలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. విద్యుత్ వినియోగదారులు తమ సలహాలు, సూచనలు వెల్లడించి టారిఫ్ రేట్లపై జరిగే చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని ఈఈ వై. శ్రీనివాసులు చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### - ఎస్ఐ రంగారావు



**వేంపల్లె –సూర్య వాస్తవం:** వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై. రంగారావు హెచ్చరించారు. శనివారం స్థానిక పట్టణంలోని కడప రోడ్డు ఎస్సీ కాలనీ వద్ద , తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రంగారావు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు. మద్యం సేవించి నడపడం, మైనర్ లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వీటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, వాహన పత్రాలు, తమ లైసెన్స్ కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుల్ శ్రీనాథ్ రెడ్డి, నాయబ్ రసూల్ పోలీస్ సిబ్బంది  పాల్గొన్నారు.

## రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

### -11వ రోజుకు చేరిన సామూహిక నిరాహార దీక్షలు




**రాయచోటి–సూర్య వాస్తవం:** ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, ఐయుఎంఎల్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాయచోటి ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని కోరుతూ వారు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలు శనివారానికి 11 రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో లిటిల్ హార్ట్ చిల్డ్రన్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని  కోరారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తే రాయచోటి చుట్టుపక్కల మండలాలు మరింత త్వరితగతిన  అభివృద్ధి చెందుతాయని రాబోయే ముందు తరాలకు మేలు చేసిన వారు అవుతారని తెలిపారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు రఘునాథరెడ్డి  మద్దతు తెలుపుతూ రాయచోటి అన్ని రకాల వనరులు, కావలసినంత భూభాగం కలిగిన ప్రదేశమని అన్ని విధాలుగా జిల్లా కేంద్రానికి అనువైన స్థలం అని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రెసిడెంట్ శివారెడ్డి, సిటిఎస్ జిల్లా కన్వినర్ అంజాద్ బాషా, రామాపురం మండల్ ప్రెసిడెంట్ గోపినాథ్,  మైనారిటీ కన్వీనర్ మున్వార్ బాష తదితరులు పాల్గొన్నారు.

## దస్తగిరి స్వామి దర్గా అభివృద్ధికి కృషి చేయండి

### - జిల్లా టిడిపి కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డిని కోరిన చింతలమడుగు పల్లి గ్రామ ప్రజలు

**వేంపల్లె – సూర్య వాస్తవం :** దస్తగిరి స్వామి దర్గా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని చింతలమడుగు పల్లి గ్రామ ప్రజలు జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డిని కోరారు. శనివారం చింతలమడుగు పల్లె గ్రామ ప్రజలు సింగారెడ్డి జయరామి రెడ్డి స్వగృహానికి వెళ్లి దర్గా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. చింతలమడుగు పల్లి సమీపంలోని గుట్ట పై వెలసిన దస్తగిరి స్వామి దర్గాకు వెళ్లడానికి సరిగా దారిలేదని, అలాగే విద్యుత్ సరఫరా లేదని తెలిపారు. అలాగే దర్గా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో జిల్లా టిడిపి కార్యదర్శి సింగారెడ్డి జయరామి రెడ్డి స్పందించారు. దర్గాలో నెలకొన్న సమస్యలను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లి  దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని జయరామిరెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఆ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సర్పంచ్ ల సంఘం తాలూకా అధ్యక్షులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, టీడీపీ యువ నాయకులు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి (బుజ్జి), జ్యోతి రెడ్డి, ఆకుల సురేష్, కమాల్ బీ, నజిమున్, బాబులు, నాగేశ్వరి, వరాలు, ఉస్సేనమ్మ, లక్ష్మిదేవి, హిమాంబి తదితరులు ఉన్నారు.





## ఘనంగా తాళ్వాయిపాడులో శ్రీ వీర్లయ్య స్వామి ఉత్సవాలు

### - ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామంలో శ్రీ వీర్లయ్య స్వామివారి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనంతో పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ ఉత్సవాల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, వైస్ ఛైర్మన్ కిలారి గోపాలకృష్ణ, నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్, నాయుడుపేట మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, టీడీపీ నాయకులు గూడూరు సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికకు బోర్డు ఏర్పాటు

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని స్మశానవాటిక రోజురోజుకు ఆక్రమణలకు గురవుతున్న సందర్భంగా హిందువులు, గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పంచాయతీ అధికారులు శనివారం స్మశాన వాటికకు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారి నరసింహులు మాట్లాడుతూ హిందూ స్మశాన వాటిక సర్వే నెంబర్ 299/547 లో ఐదు ఎకరాలు ఉండేదని ప్రస్తుతం ఆక్రమణలకు గురై రెండు ఎకరాలు కూడా స్మశాన వాటిక లేదని దీంతో హిందువులంతా కలిసి పంచాయతి అధికారులకు ఫిర్యాదు చేయగా పంచాయతీ అధికారులు స్పందించి హిందూ స్మశాన వాటికకు బోర్డు ఏర్పాటు చేశారు అన్నారు. హిందువులు ఎవరైనా మరణిస్తే పంచాయతీ ఆఫీసులో సమాచారం ఇచ్చి ఖననం చేసుకోవాలన్నారు. ఇలా చేసుకుంటే మరణ ధ్రువీకరణ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రేరక్ ఎలంకూరు విజయ భాస్కర్ గురుస్వామి రమణయ్య బిజెపి రాష్ట్ర మాజీ కిషన్ మోర్చా అధ్యక్షుడు కృష్ణ శ్రీ వెంకటేశ్వర ఆలయం ఛైర్మన్ కెవిఎస్ ప్రసాద్ విశ్రాంతి ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం బసయ్య లోకేష్ మధుబాబు శ్రీనివాసులు హరీష్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాల జోలికి వెళ్ళకండి

**- పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి**




**పులివెందుల- సూర్య వాస్తవం :** యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసు కోవద్దని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని యువతకు మోటివేషన్ క్లాసులు చెప్పవలసిందిగా పులివెందుల డిఎస్పి మురళి నాయక్‌ను కోరారు. అందుకు సంబంధించిన "సే నోటు డ్రగ్సు పోస్టర్లను డిఎస్పి తో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలో గంజాయి వ్యాపారస్తులు విచ్చలవిడిగా యువతకు గంజాయి వ్యసనానికి గురి చేస్తున్నారని చెప్పారు. అటువంటి వాళ్లను వెంటనే గుర్తించి అరెస్టు చేసి తగిన బుద్ధి చెప్పాలని చెప్పారు. అలాగే డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేయాలని కోరారు. యువతను చెడు మార్గంలోకి వెళ్లకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణంలో అధ్యక్షులు బోనాల ఖాధర్ వల్లి, ఉపాధ్యక్షులు చంద్ర బాబు, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ మహిళ అధ్యక్షులు విజయ, బిసి సెల్ అధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న ఆలయంలో విశేష పూజలు

**- ప్రత్యేక అలంకారంలో వీరాంజనేయ స్వామి**



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** సింహాద్రిపురం గ్రామంలో అతిపురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం పురస్కరించుకుని వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మంగళవారం శనివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు

# మంచినీటి పైపుల లీకేజీలకు మరమ్మతులు



**తొండూరు - సూర్య వాస్తవం :** తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలోని వీధిలో శనివారం మంచినీటి పైపుల లీకేజీలకు మరమ్మతులకు సంబంధించిన పనులు చేపట్టారు. రెండు రోజుల క్రితం పైపు లైన్ లీకేజీలతో వృథాగా పోతున్న నీటి కారణంగా పంచాయతీ అధికారులు లీకేజీ అయిన పైపులకు మరమ్మతులు చేపట్టారు. వారి సిబ్బంది లీకేజీ అయిన పైపులను తొలగించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ప్రజలకు తాగునీటిని అందించే నీటి పైపులైన్‌లలో ఎక్కడ కూడా లీకేజీలు లేకుండా సిబ్బంది జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంకాలమ్మ, కుంటేమ్మ 18వ జాతర





**పామిడి -సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని కొండూరు రోడ్డులో వెలిసిన అంకాలమ్మ, కుంటేమ్మ 18వ జాతర ఈ నెల 19, 20, 21తేదీలలో నిర్వహిస్తారు. 19వ తేది సోమవారం ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం 4గంటలకు గ్రామోత్సవం, 20 మంగళవారం జాతర, పాలపళ్ల ఎద్దులు దూలం లాగుడు పోటీలు 30వెలనుండి 4వెలవరకు బహుమతులు రాత్రి కీ బ్రహ్మం గారి చరిత్ర పౌరణిక నాటక ప్రదర్శన, 21న న్యూ కాటగేరి ఎద్దుల పందెం బహుమతులు 5వేల నుండీ 50వేల వరకు 9బహుమతులు అందిస్తారు. మూడు రోజులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తారు.ఎద్దులపందెం ఇతర వివరాలకు నాగన్న (పూజారి )9642578133ను సంప్రదించండి.

# కాలేటి వాగు డ్యాం వద్ద వైభవంగా 'జల హారతి'

## - పాల్గొన్న పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి
## - రైతన్నల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మా లక్ష్యం



**చక్రాయిపేట- సూర్య వాస్తవం :** పులివెందుల చక్రాయపేట మండలంలోని కాలేటి వాగు డ్యాం వద్ద శనివారం 'జల హారతి' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. డ్యాంకు నీళ్లు వస్తున్న తరుణంలో డ్యాం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గంగమ్మకు సారె, పూలు జలహారతి సమర్పించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. కాలేటి వాగు డ్యాం నిండటం వల్ల మండలంలోని రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని, భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా తీరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనుల న్నింటినీ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధికి, సాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు కాలేటి వాగు డ్యామ్ వద్ద జలహారతి ఇచ్చిన బీటెక్ రవి ప్రస్తుతం కాలేటివాగులో సాగునీరు సమృద్ధిగా ప్రవహిస్తోందని, ఈ నీటి లభ్యత ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఉంటుందని బీటెక్ రవి తెలిపారు. దీనివల్ల స్థానిక చెరువులను నింపుకునే అవకాశం ఉందని, కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోయిన పిల్ల కాలువలను వారం రోజుల్లోగా క్లీన్ చేయించి, రైతులకు సాగునీటి ఇబ్బం దులు లేకుండా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అద్దలమర్రి, చెరుకొన్నపల్లి పరిధిలోని మూడు ప్రధాన చెరువులను నింపేందుకు ఉన్న అడ్డంకులను తొలగించి, వారం రోజుల్లో అవసరమైన ప్రొసీడింగ్స్ ఇప్పి స్తామన్నారు.

హంద్రీ-నీవా ( హెచ్ ఎన్ ఎస్ ఎస్ ) ప్రాజెక్ట్ ద్వారా పులివెందుల మండలంలోని ఎర్రబల్లి చెరువుకు నీటిని మళ్లించడం వల్ల ఆ ప్రాంతంలో భూగర్భ జల మట్టం గణనీయంగా పెరిగిందని, దీనివల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. కాలువల లైనింగ్ పనుల కోసం చంద్రబాబు నాయుడు 400 కోట్ల రూపాయలను మంజూరు చేశారని, ఈ పనులు పూర్తయితే నీటి ప్రవాహ వేగం పెరిగి తక్కువ సమయంలోనే చెరువులను నింపవచ్చని తెలిపారు. వేల కోట్లు ఖర్చు చేసే భారీ ప్రాజెక్టుల కంటే, స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వాడుకోవడం వల్ల రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మండల ఇన్చార్జి మహేష్ రెడ్డి,లోమడ భాస్కర్ రెడ్డి( ఎల్‌బిఆర్ ), ఎద్దుల చంద్ర స్థానిక కూటమి నాయకులు, పాల్గొన్నారు.





# ఇండియా క్రీడాకారులను ఘనంగా సన్మానించిన బీటెక్ రవి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** నేపాల్ వేదికగా గత డిసెంబర్ 16నుండి 18వరకు నిర్వహించిన సౌత్ ఏషియన్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుని దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ విజేతలైన భారత జట్టులో కడప జిల్లా కు చెందిన రాచవీటి తేజేంద్ర, తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డిచర్ల దేవి ప్రియ పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి క్రీడాకారులను ఆత్మీయంగా ఆహ్వానించి తన నివాసంలో సన్మానించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, దాదాపు ఏడు శ్రీలంక, థాయిలాండ్, మల్దీస్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల జట్లతో పోటీపడి విజయం సాధించడం అత్యంత గర్వ కారణమని, ఈ విజయంతో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోల్ షాట్ బాల్ అసోసియేషన్ వారు, ఇడుపులపాయ టిడిపి నాయకులు వెంకటస్వామి మొదలగు వారు పాల్గొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



# ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్**





**కర్నూల్ - సూర్య వాస్తవం:** కర్నూలు నగరంలోని శ్రీకృష్ణదేవరాయ కూడలి నందు శనివారం శ్రీకృష్ణదేవరాయ జయంతి సందర్భంగా పూలమాలలు సమర్పించి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు బాల మద్దయ్య యాదవ్ శేష పని, సదానందము అయ్యన్న, సింధు నాగేశ్వరరావు మద్దిలేటి మల్లీ, రమేష్ మొదలైన వారంతా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ :- యాదవరాజులలో శ్రీకృష్ణదేవరాయలు అగ్రగన్యుడు జనారంజకుడు పరిపాలన అధ్యక్షుడైన తన పరిపాలన కాలంలో నీటి సరఫరా లో గాని రోడ్లు విస్తరించడంలో మొదలైన అనేక సంస్కరణలు తీసుకొని వచ్చి ప్రజలకు మంచి పరిపాలన సాగించాడు యాదవులకు బీసీలకు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్లా శ్రీనివాసరావు గారిని రాష్ట్ర టిడిపి అధ్యక్షులుగా నిర్మించడం జరిగింది అలాగే వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా సత్య కుమార్ యాదవ్‌ని నియమించి యాదవులకు పెద్దపీట వేయడం జరిగింది. అలాగే బీసీలకు 34శాతం శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలలో కల్పించి యాదవులకు బీసీలకు సముచిత స్థానం కల్పించడం జరిగింది. అలాగే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తానని మాట ఇచ్చిన మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, నారా లోకేష్‌కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామ సచివాలయాలు ద్వారా

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**
**- కాట్నగల్లు గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**మదనపల్లి – సూర్య వాస్తవం:** గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. పి.టి.యం మండలం కాట్నగల్లు గ్రామ సచివాలయాన్ని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిత తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా సచివాలయంలోని హాజరు పట్టిక, వి.ఆర్.ఓ కి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. సచివాలయంలోని విఆర్ఓ, సర్వేయర్ లతో జిల్లా కలెక్టర్... గ్రామంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు గురించి అడిగి తెలుసుకు న్నారు. దారి సమస్యలు, రీ సర్వే, మ్యుటేషన్ లు, తదితర రెవెన్యూ శాఖ కు సంబంధించిన సమస్యలు అన్ని గ్రామ సచివాలయం లోనే పరిష్కారం అయ్యే దిశగా పని చేయాలని, ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రం మరియు జిల్లా అధికారుల చుట్టూ తిరగకుండా వారి సమస్యలు గ్రామ స్థాయి లోనే ప్రజా పరిష్కారాల వేదిక నందు వారి సమస్యలను పరిష్కరించాలని, జిల్లా సచివాలయం నుండి అందుతున్న అర్జీల పై వెంటనే స్పందించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన సమయంలోనే పరిష్కరించే దిశగా పని చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీతో మాట్లాడుతూ.... గ్రామంలో ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందా లేదా, మూడు నెలలకు ఒకసారి పంచాయతీ వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరించే సమయంలో ప్రజలకు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా వారికి అవగాహన కల్పించి చెత్తను ప్రతి రోజు సేకరించాలని తద్వారా చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా పాటించాలని గ్రామానికి సరఫరా చేస్తున్న నీళ్ల ట్యాంకు ప్రతి మూడు నెలలకి ఒక సారి శుభ్రపరచి ప్రజలకు మంచి నీరు అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా ఏర్పాటుచేసిన ప్రభుత్వ సేవలు అన్నిటిని ప్రజలకు సులభతరంగా అందజేయాలన్నారు. దీనితోపాటు రైతులకు తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యవసాయంనకు అవసరమైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించే విషయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పాత్ర కీలకమన్నారు. సచివాలయ సిబ్బంది అందరూ ఉదయం మరియు సాయంత్రం ఫేస్ అటెండెన్స్ కచ్చితంగా వేయాలని ఆదేశించారు.



## వేంపల్లెలో భక్తి శ్రద్ధలతో

# వెంకన్న ప్రాకారోత్సవం



**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లెలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహించామని ఆలయ ఈఓ శుభాష్, పాలకమండలి ఛైర్మన్ పీవీ రమణ తెలిపారు.ఆలయ అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు స్వాముల నేతృత్వంలో స్వామిఅమ్మవార్లను పల్లకిపై కొలువుతీర్చి ఆస్థానం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పల్లకిని భుజాలపై పెట్టుకొని అర్చకుల వేద మంత్రోచ్ఛణతో మంగళవాయిద్యాలతో మధ్య గర్భగుడి చుట్టూ వైభవోపేతంగా ప్రాకారోత్సవం చేశారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సుబ్రమణ్యం, పెద్దరెడ్డయ్య, నారాయణమ్మ, ఆలయ సిబ్బంది రంగప్రసాద్, దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ అటెండన్స్



**విజయవాడ – సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ , వార్డు సచివాలయ వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చేందుకు సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇకపై సచివాలయ సిబ్బంది అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సమయపాలనపై వస్తున్న ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన సర్కార్, టెక్నాలజీ సాయంతో పనితీరును మెరుగుపరచాలని భావిస్తోంది. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు ఇప్పటికే ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త నిబంధనల ప్రకారం, సచివాలయ ఉద్యోగులు ఉదయం నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఆలస్యంగా వస్తే, ఆ సమాచారం నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సార్లు ఆలస్యంగా వస్తే, ఆ రోజు వేతనంలో కోత విధించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నారు. బయోమెట్రిక్ విధానంలో ఉన్న లోపాలను అరికట్టేందుకు, ఒకరి బదులు మరొకరు హాజరు వేసే అవకాశం లేకుండా ఈ ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రవేశపెడుతున్నారుసచివాలయ వ్యవస్థ ఉద్దేశమే ప్రజల చెంతకు పాలనను చేర్చడం. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఫేషియల్ అటెండెన్స్ వల్ల ఉద్యోగులు కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు నిర్ణీత సమయంలో అందుతాయని, వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే సమయంలో ఈ హాజరు విధానం ఇబ్బందికరంగా మారుతుందని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సాంకేతిక సర్దుబాట్లు చేయాలని కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, పారదర్శకమైన పాలన కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రతి 2,000 మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 10 నుండి 11 మంది ఉద్యోగులను నియమించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నుండి సంక్షేమ పథకాల లబ్ధి వరకు దాదాపు 500కు పైగా సేవలను స్థానికంగానే అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. సచివాలయ సిబ్బందికి తోడుగా గ్రామాల్లో ఉండే వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తారు. పరిపాలనను వికేంద్రీకరించి, అవినీతికి తావులేకుండా పారదర్శకమైన సేవలు అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత వాలంటీర్లను కొనసాగించలేదు. ఎక్కువ సేవలు వాట్సాప్ ద్వారానే అందిస్తున్నారు. దీంతో ఉద్యోగులకు పనిలేకుండా పోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.



# వేటగాళ్ల ఉచ్చులో పడిన పునుగు పిల్లి

**- వేటగాడు తన ఫోన్ స్టేటస్‌కు పెట్టడంతో రట్టైన గుట్టు**
**- ప్రత్యేకించి తయారు చేసిన బోనులో చిక్కి గిలగిల లాడుతున్న వైనం**
**- ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందడంతో ఆగమేఘాలపై నిందితుని కోసం గాలిస్తున్న వైనం**



**మదనపల్లి – సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లాలో శనివారం ఓ హృదయపూర్వక ఘటన వెలుగులోకి వచ్చింది. తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లి పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన వేటగాళ్ల ఉచ్చులో రాత్రి పునుగుపిల్లి చిక్కి గిలగిలా కొట్టుకుంటు ఉంది. ఈ పునుగు పిల్లి తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. పునుగుపిల్లి తైలం ఇచ్చే ఒకే ఒక జంతువు పునుగు పిల్లి. ఇది అంతరించి పోతున్న జీవ జాతుల్లో ఒకటి. పునుగుపిల్లిని ఇంగ్లిష్‌లో సివెట్, టాడీ క్యాట్ అంటారు. ఈ పిల్లి నుంచి తీసిన తైలాన్ని ప్రతి శుక్రవారం తిరుమలలో కొలువున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి అభిషేకం అనంతరం స్వామివారి విగ్రహానికి పూస్తారు. పునుగుపిల్లి శరీర గ్రంథుల ద్వారా చెమటను విసర్జిస్తుంది. అది దాని శరీరంపై కొద్దిగా అట్ట కడుతుంది. తర్వాత పునుగు పిల్లి జల్లెడలో నిలబెట్టిన చందనపు కర్రకు తన శరీరాన్ని రుద్దుకుంటుంది. ఇలా చేయడంతో దాని శరీరంపై చెమట ద్వారా వచ్చినదంతా కర్రకు బంకలా అంటుతుంది. దీనిని తైలంగా ఉపయోగిస్తారు.

దురదృష్టవశాత్తు, వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి పునుగుపిల్లి ఇలా గిలగిలలాడుతోంది. అటవీ జంతువులను హతమార్చేందుకు వేటగాళ్లు అమర్చిన బోనులో చిక్కుకోవడాన్ని ఆ వేటగాడు తన ఫోన్ స్టేటస్ లో పెట్టి తన పాపం పండిపోయింది. ఇదిలా ఉండగా ఏడాది క్రితం మదనపల్లి మండలం పొన్నెటి పాలెంలో నిండు గర్భంతో ఉన్న చిరుత పులిని వేటగాళ్లు ఉచ్చు బిగించడంతో అందులో చిక్కుకుని అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో చివరకు ప్రాణాలు విడిచింది. ఈ ఉదంతా మరువకనే మరో భయానక ఘటన వెలుగు చూడడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత అటవీశాఖ అధికారులకు కొందరు సమాచారం అందించినట్లు తెలిసింది. అధికారులు నిందితులను పట్టుకుని ప్రాణాలతో పునికిపిల్లిని రక్షిస్తారా లేదా ఆ పుగును పిల్లిని పక్షించిన తర్వాత పట్టుకుంటారా అన్నది వేచి చూడాల్సి ఉంది....

## ట్రాఫిక్ నియంత్రణకు

# సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**ంమదనపల్లి – సూర్య వాస్తవం:** మదనపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మదనపల్లి లో పెరుగుతున్న వాహన రద్దీని నియంత్రించి ప్రజలకు సులభమైన రవాణా సౌక ర్యాలు కల్పించేందుకు ట్రాఫిక్ నియంత్రణపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలిసి పోలీస్ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీతో... మదనపల్లిలో ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్ రూట్లు, పార్కింగ్ సమస్యలు, ఎన్క్రోచ్‌మెంట్లు, వన్-వే విధానం తదితర అంశాలపై సమీక్షించారు. పట్టణంలోకి భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సులు, లారీలు, ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, దీన్ని నియంత్రించేందుకు పట్టణ శివార్ల లోనే బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను గుర్తించాలని, పట్టణం లోని ప్రధాన రోడ్డులు కడప - రాయచోటి, తిరుపతి, బెంగళూరు మార్గాల నుంచి వచ్చే బస్సులకు ప్రత్యేక రూట్లు కేటాయించి, నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పట్టణంలోని ముఖ్య రహదారుల్లో ఎన్క్రోచ్‌మెంట్లను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో తొలగింపు, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు భారీ వాహనాలపై పరిమితులు విధించడం, అవసరమైన చోట్ల తక్కువ వ్యయంతో తాత్కాలిక డివైడర్లు ఏర్పాటు చేయడం, ముఖ్యమైన కూడలిలో ట్రాఫిక్ సంకేతాలు మరియు ముఖ్యజంక్షన్ల వద్ద ఎంట్రీ-ఎగ్జిట్ నియంత్రణ మరియు మదనపల్లి నుండి విజయవాడ, హైదరాబాద్ వైపు వెళ్ళే ప్రైవేట్ బస్సు వారు ప్రధాన కూడలిలో ఎక్కువ స్టాపింగ్స్ లో నిలవకుండా తక్కువ స్టాపింగ్స్ ఏర్పాటు చేసుకొని ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా ఏర్పాటు చేయడం, ప్రధాన మార్గాలలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ పై నియంత్రణ, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ప్రైవేట్ బస్ ఆపరేటర్లు, ట్రావెల్స్ నిర్వాహకులు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్త ట్రాఫిక్ విధానంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, ట్రాఫిక్ సిఐ గురునాథ్, వన్ టౌన్, టూ టౌన్ సిఐలు రాజారెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.





# ప్రముఖ నటి శారదకు జెసి డేనియల్ అవార్డు

## - 25న ప్రదానం చేయనున్న కేరళ ప్రభుత్వం

**తిరువనంతపురం :** ప్రముఖ సీనియర్ నటి శారద అరుదైన గౌరవం అందుకున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు ఆమె చేసిన జీవితకాల సేవలకుగాను కేరళ ప్రభుత్వ అత్యున్నత సినీ పురస్కారం 'జెసి డేనియల్ అవార్డు-2024'కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కేరళ సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి సాజి చెరియన్ తిరువనంతపురంలో అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 25న తిరువనంతపురంలో జరిగే కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా శారద ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కింద రూ. 5 లక్షల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తారు. గీత రచయిత, చిత్ర నిర్మాత కుమారన్ తంపి నేతృత్వంలోని జ్యూరీ 80 ఏళ్ల శారదను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో ఈ అవార్డు అందుకోనున్న 32వ వ్యక్తిగా శారద నిలవనున్నారు. 1960 నుంచి రెండు దశాబ్ధాలకు పైగా అనేక చిత్రాల్లోని గొప్ప పాత్రాల ద్వారా మలయాళీ మహిళలకు ప్రతినిధిగా శారద నిలిచారని జ్యూరీ పేర్కొంది. ఆ కాలంలో మలయాళీ మహిళల బాధలను, దుఃఖాన్ని తన నటన ద్వారా శారద వ్యక్తీకరించారని జ్యూరీ ప్రశంసించింది. త్రివేణి, మురప్పెన్ను, మూలధనం, ఒరు మిన్నమినుంగింటే నూరుంగువేట్టం.. వంటి చిత్రాల్లోని శారద పోషించిన మరపురాని పాత్రలను జ్యూరీ ఈ సందర్భంగా ప్రస్తావించింది.

# కొత్త సినిమాల షూటింగ్‌లు షురూ



సంక్రాంతి పండుగ సందర్భంగా సినీ పరిశ్రమ నుంచి కొన్ని కొత్త సినిమాల షూటింగ్ తాలూకా ఫొటోలు విడుదల య్యాయి. ఇప్పటికే షూటింగ్‌లు జరుపుకుంటున్న ఈ సినిమాల పోస్టర్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇలా పండగ సంబరమంతా చిత్రసీమలోనే కనిపించింది.

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కథానాయకుడిగా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమ వుతున్నారు. 'బలగం' సినిమాతో అందర్నీ మెప్పించిన దర్శకుడు వేణు యెల్దండితో 'ఎల్లమ్మ' అనే చిత్రం చేస్తున్నారు. ఈ ఇద్దరి కలయికలో రూపొందుతున్న ఈ సినిమాని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ యాక్షన్ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

తమిళ స్టార్ విజరు సేతుపతితో దర్శకుడు పూరి జగన్నాథ్ 'స్లమ్‌డాగ్' పాన్ ఇండియా చిత్రం రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. పూరి కనెక్ట్స్ పతాకంపై ఛార్మి, జేబీ నారాయణ రావు నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్, టబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 33 టెంపుల్ రోడ్ అనేది ఉపశీర్షిక. ఈమేరకు విజరు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

నటుడు అర్జున్ తన కుమార్తెను కథానాయికగా తెరకు పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సీతా పయనం'. నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. హీరో ధ్రువ సర్జా ప్రత్యేక పాత్రలో నటించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాలోని'చూడే బసవన్న వచ్చాడు చూడే.. వచ్చినోడు అర్జునుడు బాణం లాంటోడే' అంటూ ధ్రువ సర్జా పాత్ర నేపథ్యంలో సాగిన ఈ పాటను అనూప్ రూబెన్స్ స్వరపరిచారు.

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నాగబంధం'. కిశోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. నభా నటేష్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. జగపతిబాబు, మురళీప్రకాష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# యుపి సంచలనం

## - డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయికి ఝలక్
## - మహిళల ప్రీమియర్ లీగ్

**నవీ ముంబయి:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) మ్యాచ్‌లు హోరాహోరీగా సాగు తున్నాయి. శనివారం జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో మెగ్ లానింగ్ సారథ్యంలోని యుపి వారియర్స్ జట్టు 22 పరుగుల తేడాతో డిఫెండింగ్ ఛాంపి యన్ ముంబయి ఇండియన్స్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపి వారియర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 187 పరుగులు చేయగా.. అనంతరం ముంబయి జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6వికెట్లు కోల్పోయి 165పరుగులకే పరిమితమైంది. దీంతో యుపి జట్టు ఈ లీగ్‌లో రెండో విజయాన్ని నమోదు చేసుకోగా.. ముంబయి జట్టు రెండో మ్యాచ్‌లో ఓడినా.. 2వ స్థానంలోనే కొనసాగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యుపికి శుభారంభం దక్కలేదు. ఓపెనర్ నవ్‌గైర్(0) డకౌటైంది. దీంతో యుపి జట్టు 5పరుగుల వద్ద తొలి వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ మెగ్ లానింగ్(70), లిచ్‌ఫీల్డ్(61) కలిసి 2వ వికెట్‌కు ఏకంగా 119పరుగులు జతచేసి భారీ పునాది వేశారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔటైనా.. హర్లిన్, ట్రయాన్ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డారు. ముంబయి బౌలర్లు అమేలియా కెర్ర్‌కు మూడు, నాట్ స్కీవర్‌కు రెండు, క్యారీ, మాథ్యూస్, అమన్‌జ్యోత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ముంబయి టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. దీంతో ఆ జట్టు 69పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో అమేలియా కెర్ర్(49), అమన్‌జ్యోత్(41) ధనా ధన్ బ్యాటింగ్‌తో మెరిసినా.. మ్యాచ్‌ను గెలిపించలేకపోయారు. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6వికెట్లు కోల్పోయి 165పరుగులకే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మెగ్ లానింగ్‌కు దక్కింది.




### స్కోర్‌బోర్డు

యుపి వారియర్స్ మహిళల ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (సి)అమన్‌జ్యోత్ కౌర్ (బి)మాథ్యూస్ 70, నవ్‌గైర్ (బి)నికోలా క్యారీ 0, లిచ్‌ఫీల్డ్ (సి)సంస్కృతి గుప్తా (బి)అమన్‌జ్యోత్ కౌర్ 61, హర్లిన్ డియోల్ (స్టంప్)కమిలిని (బి)అమేలియా కెర్ర్ 25, ట్రయాన్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)నాట్ స్కీవర్ 21, శ్వేతా సెహ్రావత్ (సి)కమిలిని (బి)నాట్ స్కీవర్ 0, ఎక్లేస్టోన్ (స్టంప్)కమిలిని (బి)అమేలియా కెర్ర్ 1, దీప్తి శర్మ (సి)కమిలిని (బి)అమేలియా కెర్ర్ 0, శోభన (నాటౌట్) 1, అదనం 8. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 187 పరుగులు. వికెట్ల పతనం: 1/5, 2/124, 3/136, 4/177, 5/177, 6/185, 7/186, 8/187 బౌలింగ్: నికోలా క్యారీ 4-0-38-1, సంస్కృతి గుప్తా 2-0-16-0, నాట్ స్కీవర్ 4-0-22-2, మాథ్యూస్ 3-0-40-1, అమన్‌జ్యోత్ 3-0-38-1, అమేలియా 4-0-28-3.

**ముంబయి ఇండియన్స్ మహిళల ఇన్నింగ్స్:** మాథ్యూస్ (సి అండ్ బి) ఎక్లేస్టోన్ 13, సజీవన్ సజన (ఎల్‌బి)క్రాంతి గాడ్ 10, నాట్ స్కీవర్ (సి)మెగ్ లానింగ్ (బి)శిఖా పాండే 15, హర్మన్‌ప్రీత్ (సి)సోఫీ ఎక్లేస్టోన్ (బి)ట్రాయాన్ 18, నికోలా క్యారీ (సి)హర్లిన్ డియోల్ (బి)దీప్తి శర్మ 6, అమేలియా కేర్ (నాటౌట్) 49, అమన్‌జ్యోత్ కౌర్ (సి అండ్ బి)శిఖా పాండే 41, కమిలిని (నాటౌట్) 9, అదనం 4. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 165పరుగులు. వికెట్ల పతనం: 1/23, 2/23, 3/44, 4/57, 5/69, 6/152 బౌలింగ్: క్రాంతి గాడ్ 4-0-32-1, శిఖా పాండే 4-0-30-2, ఎక్లేస్టోన్ 4-1-33-1, దీప్తి శర్మ 4-0-35-1, ట్రయాన్ 2-0-18-1, శోభన 2-0-17-0.

## ముఖ్యమంత్రి గారూ!

## కడప -రాయచోటి- మదనపల్లి -బెంగళూరు

# నూతన రైల్వే మార్గంపై సీత కన్నేల?

### - సూటిగా ప్రశ్నించిన తులసిరెడ్డి

**వేంపల్లె – సూర్య వాస్తవం :**

ముఖ్యమంత్రి రాయలసీమ వాసిగా ఉంటూ రాయలసీమ సమగ్రాభివృద్ధికి దోహదపడే కడప-రాయచోటి -మదనపల్లి- బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలుబుచ్చారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతుల, వినియోగదారుల, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం 2008 -09 రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నాటి కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కడప-రాయచోటి -మదనపల్లి -బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గాన్ని మంజూరు చేసిందన్నారు దీన్ని పొడవు 255. 40 కిలోమీటర్లు.ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్ర ప్రదేశ్ లో మిగిలిన 50. 40 కిలోమీటర్లు కర్ణాటక రాష్ట్రంలో నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 50శాతం రాష్ట్రప్రభుత్వం భరించే షరతులతో మంజూరు అయింది. 2008 -09 అంచనాల మేరకు ప్రాజెక్టు వ్యయం 3038 కోట్ల రూపాయలు. 2010 సెప్టెంబర్ మాసంలో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారు.నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలి . మొదటి దశలో కడప నుండి పెండ్లిమర్రి వరకు, రెండవ దశలో పెండ్లిమర్రి నుండి రాయచోటి మీదుగా మదనపల్లి



వరకు, మూడవ దశలో మదనపల్లి నుండి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు అయిన ముల్బాగల్ వరకు,నాలుగో దశలో ముల్బాగల్ నుండి కోలార్ వరకు నిర్మాణం పూర్తి అయ్యేవిధంగా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఇందులో మొదటి దశ కడప నుండి పెండ్లిమర్రి వరకు 21. 80 కిలోమీటర్ల పని పూర్తి అయింది. 351 కోట్ల రూపాయలు ఖర్చు చేయడమైనది.ఆంధ్రప్రదేశ్ వాటాగా 132.39 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగింది. రాష్ట్రంలో 2019 మేలో వైయస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వవలసిన నిధులు ఇవ్వని కారణంగా రైల్వే శాఖ పనులు నిలి పివేసింది. ఈ నేపథ్యంలో పుండు మీద కారం చల్లినట్లు ఈ రైల్వే లైను అవసరం లేదు అని జగన్ ప్రభుత్వం 17- 6 -2021న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.ఇది ప్రగతి నిరోధక చర్య.ఈ విధంగా రాయలసీమకు జగన్మోహన్ రెడ్డి తీరని ద్రోహం, అన్యాయం చేశాడు.

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత నైనా నిలిచిపోయిన పనులు మళ్లీ ప్రారంభమవుతాయని రాయలసీమ వాసులు ఎంతో ఆశపడ్డారు. దురదృష్టవశాత్తు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు అయినప్పటికీ ఈ రైల్వే ప్రాజెక్టు గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు . రాష్ట్రంలో, కేంద్రంలో డబులింజన్ సర్కారే ఉంది. డబులింజన్ సర్కార్ తో అనేక ప్రయోజనాలు ఉంటాయని అటు ప్రధానమంత్రి మోదీ,ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తూ ఉంటారు.ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు గురించి ఎందుకు పట్టించుకోకపోవడం లేదని తులసిరెడ్డి ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుండి మదనపల్లి కు మార్చిన కారణంగా రాయచోటి ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కనీసం ఈ రైల్వే ప్రాజెక్ట్ అయినా పూర్తి అయితే కొంత మేరకు రాయచోటి వాసులు తృప్తి చెందే అవకాశం ఉంది. ఇప్పటికైనా చంద్రబాబు చొరవ తీసుకొని అర్ధాంతరంగా ఆగిపోయిన కడప రాయచోటి మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గం నిర్మాణ పనులను వెంటనే రైల్వే శాఖ పునః ప్రారంభించేటట్లు చూడాలని తులసి రెడ్డి ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. అబ్బడు బావి త్రవిస్తే కొడుకు పూడ్చినాడు అన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రైల్వే ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం,జగన్ ప్రభుత్వం,చంద్రబాబు ప్రభుత్వం పనులు నిలిపివేయడం శొచనీ యమని తులసి రెడ్డి అన్నారు.

# రాయదుర్గంలో మెగా రక్తదాన శిబిరం

### - విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి



**రాయదుర్గం– సూర్య వాస్తవం :**
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా ఈనెల 18వ తేదీ ( ఆదివారం) రాయదుర్గం పట్టణం బళ్లారి రోడ్డులోని సీతారామాంజనేయ కళ్యాణ మండ పంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణమండపంలో శనివారం రక్తదాన శిబిరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలకు, కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ వచ్చి రక్తదానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే రక్తదాన శిబిరంలో రక్తదాతలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు.రక్తదానం మహాదానమనీ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్తదానం ద్వారా మీరు రక్షించిన వారు అవుతారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషిచేసిన మహోన్నత వ్యక్తికి మనమిచ్చే ఘనమైన నివాళిలో అందరూ పాల్గొనాలన్నారు. యువతి, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేరుపేరునా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ కు చెందిన ఎన్టీఆర్ ట్రస్ట్, బళ్ళారి విమ్స్ ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. చికిత్స కోసం మన నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది బళ్లారి ఆసుపత్రికి వెళుతుంటారన్నారు. కావునా మనంచేసే రక్తదానం మన నియోజకవర్గ ప్రజలకే ఎక్కువగా ఉపయోగపడుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,మండల కన్వీనర్ కురుబ హనుమంతు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, బుదురు తిప్పేస్వమి, అగ్రహారం కిరణ్ ,ఇనాయత్, వై.వెంకటేశు లు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పాలపొంగు కార్యక్రమాలు






**పులివెందుల – సూర్య వాస్తవం :**

పులివెందులలోని ఆర్యవైశ్య కాలనీలో వెలిసిన టువంటి శ్రీలక్ష్మీనర సింహస్వామి పార్వేటి ఉత్సవం సందర్భంగా పాలపుంగు కార్యక్రమాలు వైభ వంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కనుమ పండుగ నాడు మాత్రమే జరిగే ఫార్మేట్ ఉత్సవ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం ఎంతో భక్తిశ్రద్ధలతో పాల పొంగుల కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య కాలనీలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కార్యక్రమాలు వైభ వంగా నిర్వహి ంచారు.

ఈ కార్యక్రమాలలో ఆలయ అర్చకులు వేణుగోపాల్, పుల్లగూర సుధాకర్, కరుణాకర్, రెండో వార్డు కౌన్సిలర్ మిట్ట గంగా లక్ష్మి, జేఎస్టీయూ రా జేష్, పుల్లయ్య, సుబ్బయ్య, ఆర్యవైశ్య ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషకు చిరస్థాయి గౌరవం తెచ్చిన మహాచక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు

### - జనసేన పార్టీ నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్



**వేంపల్లి – సూర్య వాస్తవం :** దేశ భాషలందు తెలుగు లెస్స అని, తెలుగుభాష, జాతి, వైభవాన్ని ప్రపంచ నలు మూలల తెలియ జేసిన విజయనగర సామ్రాజ్య వీరులు, అఖండ భారత మహా చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు అని జనసేన నాయకులు దాసరి రవిశంకర్ కొనియాడారు. శనివారం శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా కడపలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దాసరి రవిశంకర్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ దేవ రాయలు పాలన తెలుగు జాతికి స్వం ర్ణయుగమని పేర్కొన్నారు. తెలుగు భాషకు ఎనలేని గౌరవం తీసుకొచ్చిన మహానుభావుడిగా శ్రీ కృష్ణ దేవరాయలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. అష్టదిగ్గజాల ద్వారా తెలుగు సాహి త్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదేనని కొనియాడారు. నేటి యువత ఆయన జీవితం, పరాక్రమం, పరిపాలనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత అని పేర్కొన్నారు. నివాళులు అర్పించిన వారిలో మధుసూదన్ రాయల్, లక్ష్మి నారాయణ రాయల్, సుదర్శన్ రాయల్ తదితరులు ఉన్నారు.

## గండిక్షేత్రంలో అధిక సంఖ్యలో పోటెత్తిన భక్తులు



**వేంపల్లె – సూర్య వాస్తవం :** రాయలసీమ లోనే ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. తెల్లవారుజామున నుంచే భక్తులు అధిక సంఖ్యలో గండిక్షేత్రం కు చేరుకుని పాపాగ్ని నదిలో స్నానాలు చేసి ఆంజనేయ స్వామి ని దర్శించుకున్నారు. దర్శనానికై వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి, రఘుస్వామిలు ఆంజనేయ స్వామి దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక్కడ ప్రవహిస్తున్న పాపాగ్ని నదిలో స్నానాలు చేసి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గండిక్షేత్రం కు తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సహాయ కమీషనర్ జె.వెంకట సుబ్బయ్య, ఆలయ పాలకమండలి చైర్మెన్ కావలి కృష్ణ తేజలు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## దేవాలయాలకు పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

### - శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంపునరుద్ధరణకు, ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు

### - ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా చెక్కు పంపిణీ

**ప్యాపిలి– సూర్య వాస్తవం :** ప్యాపిలి మండలంలోని బురుగుల గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాల స్వామి దేవ స్థానం పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వం అక్షరాలా రూ.80 లక్షలు మంజూరు చేయడం జరిగింది. ఈ నిధుల ద్వారా ఆలయానికి అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ ముఖ్యమైన నిధుల మంజూరుకు డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కృషిని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా శనివారం క్యాంప్ కార్యాల యంలో ఎమ్మెల్యేని కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం పునరుద్ధరణతో గ్రామ ఆధ్యాత్మిక వాతావరణం మరింత ఉత్సాహవంతంగా మారడంతో పాటు, భక్తుల సంఖ్య కూడా పెరుగు తుందని, తద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబన్న యాదవ్, సూర్య ప్రకాష్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, గంగ రాజు, పెద్ద పాపోడు. మద్దయ్య. కంబగిరిస్వామి, రాజు యాదవ్, బూరుగుల గ్రామ నాయకులు, ప్రజలు, ప్యాపిలి మండల సీనియర్ నాయకులు, లక్ష్మీనారాయణ యాదవ్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )